# దైవం మానుష రూపేణ

**పాపభయంబుపోయె పరిపాటయిపోయెను దుష్కృతంబిలన్**
**శ్రీపతి భక్తిపోయె వివరింపగలేని దురంతకృత్యముల్**
**దాపురమయ్యె లోకమున తాపసలోక శరణ్యుడగు ఆ**
**శ్రీపతి నామచింతనయె చేకురజేయు సుఖంబు మానవా!**

ప్రేమస్వరూపులారా! దృశ్యకల్పితమైన ఈ చరాచర జగత్తంతయు ప్రపంచమనే పేరుతో పిలువబడుచున్నది. పంచభూతములయొక్క స్వరూపమే ప్రపంచం. దివ్యమైన, భవ్యమైన ఆత్మతత్త్వం కంటికి కనిపించదు. కంటికి కనిపించునవి, మనసుకు అనిపించునవి, హృదయాన్ని మురిపించునవి, మైమరపించునవి పంచభూతములే. వీటి తత్త్వమును అర్థం చేసుకున్నప్పుడు మానవుడే మాధవుడౌతాడు.

గాయత్రీమంత్రమునందు "భూర్భువస్సువః" అనే పదములున్నవి. "భూః" అనేది పదార్థముల యొక్క స్వరూపం. దీనిని 'మెటీరియలైజేషన్' అన్నారు. "భువః" అనేది వాయువుకు సంబంధించినది. దీనిని 'వైబ్రేషన్' అన్నారు. ఇంక మూడవది "సువః". ఇదే పరమజ్ఞానము. దీనినే 'రేడియేషన్' అన్నారు. ఈ రోజు ఉదయం పండితులవారు దక్షిణామూర్తి గురించి చెప్పారు కదా! పరమ పవిత్రమైన జ్ఞానస్వరూపమే దక్షిణామూర్తి!

**నాల్గు మహావాక్యాలు**

నాల్గు వేదములు ప్రపంచానికి నాల్గు మహావాక్యములను బోధిస్తున్నవి. అవియే "ప్రజ్ఞానం బ్రహ్మ", "అయమాత్మా బ్రహ్మ", "అహం బ్రహ్మాస్మి", "తత్త్వమసి" అనునవి. ప్రజ్ఞానమనగా ఏమిటి? పుస్తకజ్ఞానమా? లేక శరీరంతో అనుభవించే అనుభూతియా? కాదు, కాదు. సర్వకాల సర్వావస్థలయందు మీయందు ప్రవహించే జ్ఞానప్రవాహమే ఈ ప్రజ్ఞానం. అనేకమంది దీనిని Supreme Knowledge అంటున్నారు. కాని, అది దీనికి తగిన పేరు కాదు. Constant Integrated Awareness అనేదే దీనికి సరియైన పేరు. ఇది మార్పు లేనిది,

sri sathyasai vachanamrutam

కూర్పు చెందనిది. ఇది మానవత్వంలో సర్వత్రా వ్యాపించియున్నది.

భగవంతునికి వాయుస్వరూపుడని పేరు. వాయువు ప్రవేశించని ప్రదేశం ఈ జగత్తులో కానరాదు. అదేరీతిగా దైవత్వం సర్వత్రా వ్యాపించియున్నది. తనలోపల, వెలుపల, సర్వత్రా ఉన్న దైవాన్ని మానవుడు ఎందుకు గుర్తించలేకపోతున్నాడు? అంతా తానే అయి ఉండి తనను తాను గుర్తించుకోలేకపోవటం ఎంత అజ్ఞానం! భగవంతుడు ఏదో ఒక ప్రత్యేకమైన ప్రదేశమునందున్నాడని భావించి, అతనిని దర్శించటానికి ప్రయత్నిస్తున్నాడు మానవుడు. తానే దైవమైయుండగా దైవాన్ని బయట వెదకటమెందుకు? భగవత్స్వరూపములైన పంచభూతములు తనయందే ప్రకాశించుచుండగా, భగవంతుణ్ణి బయట వెదకటానికి ప్రయత్నించేవాడు ఎంత మూర్ఖుడు! ఎంత పిచ్చివాడు! ప్రతి ప్రాణియందు దైవత్వమున్నది. దైవత్వం లేకుండా ఏ ప్రాణీ జీవించుటకు వీలుకాదు. జీవులయొక్క నరనరములందూ సంచరించే ప్రాణమే దైవస్వరూపం. అదే "ప్రజ్ఞానం బ్రహ్మ."

"అయమాత్మా బ్రహ్మ" అనేది రెండవ మహావాక్యం. దీనిని I am Atma, Brahma అని కూడా చెప్పవచ్చును. మూడవది "తత్త్వమసి". 'తత్' అనగా బయటిది, 'త్వం' అనగా లోపలిది. లోపల, బయట సంచరించే దివ్యత్వమే తాను. "అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణ స్థితః" మానవునియందున్న చైతన్యమే దైవస్వరూపం. తన లోపలున్నదే తనకు బయట కనిపిస్తున్నది. 'రియాలిటీ' తనయందే ఉండగా 'రిఫ్లెక్షన్'కోసం ప్రాకులాడటం వెఱ్ఱితనమే కదా! నీరు, అగ్ని, వాయువు మున్నగు పంచభూతములకు తానే 'మాస్టర్'గా ఉన్నాడు. ఇట్టి తన తత్త్వాన్ని మానవుడు గుర్తించుకోవాలంటే మొట్టమొదట మనస్సును అదుపులో పెట్టుకోవాలి. Master the mind, be a mastermind. మనస్సుకు తాను మాస్టర్ (యజమాని)గా ఉండాలేగాని, సర్వెంట్ (సేవకుడు) కాకూడదు. మనస్సును తన సర్వెంట్‌గా భావించాలి. ఈ 'సర్వెంట్' యొక్క మాటలపై ఆధారపడకూడదు. కైక తన దాసియైన మంథర మాటలు విని ఎన్ని బాధలకు గురి అయిందో మీకు తెలుసు. కనుక మనస్సుపై ఆధారపడటం చాలా పొరపాటు

.

srisathyasaivachanamrutam

## దివ్యత్వం మనిషియందే ఉన్నది

మహాశక్తివంతమైన పంచభూతములను తన యందే ఉంచుకొని మానవుడు శక్తిహీనునివలె ప్రవర్తిస్తున్నాడు. వేదము చెప్పింది – "అణోరణీయాన్ మహతో మహీయాన్". పరమాత్మ అణువులో అణువుగా, ఘనములో ఘనముగా ఉన్నాడు. ఇలాంటి పరమాత్మతత్త్వాన్ని ఎవరు గుర్తించగలరు? తనయందే ఉన్న దివ్యత్వాన్ని ఎవరు చూడగలరు? ఎవరైనా చూడవచ్చును. అయితే దృష్టిని అంతర్ముఖం గావించుకోవాలి. కాని మానవుని దృష్టి బహిర్ముఖంగా ఉన్నది. "పశ్యన్నపి చ నపశ్యతి మూఢో". మీరు చూసేది, వినేది, అనుభవించేది అంతా భగవత్స్వరూపమే అనే సత్యాన్ని గుర్తించాలి.

మానవ జన్మ చాలా దుర్లభమైనది. "దైవం మానుష రూపేణ" దైవం మనుష్యరూపంలో ఉంటున్నాడు. దైవత్వాన్ని దర్శించటానికి ఇంతకంటే గొప్ప రూపం మరొకటి లేదు. సర్వమూ మనిషియందే ఇమిడియున్నది. కనుక మనిషి తన తత్త్వాన్ని తాను గుర్తించుకోవాలి. సకల వేదశాస్త్రములు మనుష్యాకారంలోనే దైవత్వాన్ని గోచరింపజేస్తున్నవి. అయితే దైవత్వం కేవలం మనుష్యరూపమునకు పరిమితం కాదు. ఒక దున్నపోతే గనుక భగవంతుణ్ణి పూజించాలనుకుంటే, భగవంతుడు బ్రహ్మాండమైన ఆకారం గల దున్నపోతువలె ఉంటాడని భావించి పూజిస్తుంది. అదేరీతిగా, మానవుడు కూడా మానవాకారంలోనే దైవత్వాన్ని దర్శించటానికి వీలౌతుంది. భగవంతునికి ఇట్టిది, అట్టిది అని భేదం లేదు. భగవంతుడు ఇది చేయవచ్చును, అది చేయకూడదని శాసించే అధికారం ఎవ్వరికీ లేదు. సర్వమూ భగవంతుడే; ప్రతి క్రియ, ప్రతి నరము, ప్రతి అణువులోనూ భగవంతుడే ఉన్నాడు. అంతా తన స్వాధీనమే. తాను ఏమైనా చేయవచ్చు; ఏది చేసినా పరార్థం కోసమే గాని, తన స్వార్థంకోసం కాదు. స్వార్థరహితమైన భావంతో ఏది సంకల్పించినా అది దైవసంకల్పమే. ఇట్టి సంకల్పములను తప్పు పట్టుటకు ఎవ్వరికీ వీలుకాదు.

## జీవితభవనమునకు ఆత్మవిశ్వాసమే పునాది

దైవత్వం ఇట్టిది, అట్టిది అని ఎవ్వరూ వర్ణించలేరు. సర్వత్రా ఉన్నది దైవత్వమే. పంచభూతములలో దైవత్వం ఉన్నది. కాబట్టి పంచభూతములనే పరమాత్మస్వరూపాలుగా

విశ్వసించాలి. అట్టి విశ్వాసంతోనే మీరు సత్యాన్ని దర్శించి, శాంతిని పొంది, ఆనందాన్ని అనుభవించాలి. "ఈమె నా తల్లి" అని విశ్వసించినప్పుడే మీరు మీ తల్లిని ప్రేమించగలరు. కనుక విశ్వాసమెక్కడో ప్రేమ అక్కడ. ప్రేమ ఎక్కడో శాంతి అక్కడ. శాంతి ఎక్కడో సత్యమక్కడ. సత్యమెక్కడో ఆనందమక్కడ. ఆనందమెక్కడో దైవమక్కడ.

కనుక మొట్టమొదట విశ్వాసమును పెంచుకోవాలి. విశ్వాసమున్నప్పుడే దైవత్వం ప్రాప్తిస్తుంది. కనిపించే భవనమునకు కనిపించని పునాదియే ఆధారం. అదేరీతిగా జీవితభవనమునకు ఆత్మవిశ్వాసమే పునాది. Self-confidence (ఆత్మవిశ్వాసం) ఉన్నప్పుడే Self-satisfaction (ఆత్మసంతృప్తి) కల్గుతుంది. ఆత్మసంతృప్తి కల్గినప్పుడే Self-sacrifice (స్వార్థత్యాగం) చేయవచ్చును. స్వార్థత్యాగం చేసినప్పుడే Self-realisation (ఆత్మసాక్షాత్కారం) ప్రాప్తిస్తుంది. ఆత్మవిశ్వాసం - Foundation (పునాది), ఆత్మసంతృప్తి - Walls (గోడలు), స్వార్థ త్యాగం - Roof (పైకప్పు), ఆత్మసాక్షాత్కారం - Life (జీవితం). ఆత్మసాక్షాత్కారం కల్గినప్పుడు "అంతా నేనే" అనే సత్యం బోధపడుతుంది. ఆత్మసాక్షాత్కారమునకు ఆత్మ విశ్వాసం అత్యవసరం. కాని నేటి మానవుడు ఆత్మవిశ్వాసమును కోల్పోయినాడు. ఆత్మవిశ్వాసమును కోల్పోయినవాడు సర్వమును కోల్పోయినవాడౌతాడు.

**"సహస్ర శీర్షా పురుషః..."**

భగవత్స్వరూపములైన పంచభూతములు మానవునియందే ఉన్నాయి. కాబట్టి మానవుడే దేవుడు. దైవానికొక ప్రత్యేకమైన ఆకారం లేదు. కాని, మానవుడు దైవానికి అనేక ఆకారములు కల్పించి పూజిస్తున్నాడు. ఈనాడిక్కడ దక్షిణామూర్తి విగ్రహాన్ని పెట్టారు. ఇది కేవలం ఊహాచిత్రమేగాని, సాక్షాత్కారచిత్రము కాదు. భగవంతుడు విశ్వస్వరూపుడు. "సహస్ర శీర్షా పురుషః సహస్రాక్షః సహస్ర పాత్" అన్ని శిరములూ, అన్ని నేత్రములూ, అన్ని పాదములూ పరమాత్మునివే. అందరి హృదయమూ పరమాత్మునిదే. కాని, మీరు దేహభ్రాంతి చేత ఈ సత్యాన్ని గుర్తించుకోలేక "మేము మానవులం" అని భావిస్తున్నారు. ఆకారంలో మీరు మానవులేగాని, నిజంగా మీరు దైవస్వరూపులే.

"అహం బ్రహ్మాస్మి" (నేనే దైవం) అనే విశ్వాసాన్ని అభివృద్ధిపరచుకోండి. "ఇది నా కర్చీఫ్"

srisathyasaivachanamrutam

అన్నప్పుడు నేను వేరు, కర్చీఫ్ వేరు. “ఇది నా టంబ్లర్” అన్నప్పుడు టంబ్లర్ వేరు, నేను వేరు. అదేరీతిగా “ఇది నా దేహము, నా మనస్సు, నా చెయ్యి, నా కాలు...” అన్నప్పుడు వీటన్నింటికంటే ‘నేను’ వేరుగా ఉండాలి కదా! ఈ ‘నేను’ ఎవరు? అని ప్రశ్న వేసుకోండి. దేహము, మనస్సు, బుద్ధి, చిత్తము.... ఇవి కేవలం పనిముట్లు మాత్రమే. అన్నింటికీ ‘నేనే’ యజమాని. ఈ సత్యాన్ని మీరు గుర్తించుకుంటే దేహము, మనస్సు, బుద్ధి, చిత్తము... వీటన్నింటికీ అతీతమైన ఆత్మతత్త్వాన్ని మీరు గుర్తించినవారౌతారు. ఇదొక వెండిప్లేటు. దీనిని మూత పెట్టటానికి ఉపయోగిస్తున్నాము.

ఇదొక వెండి టంబ్లర్. దీనిని నీరు త్రాగటానికి ఉపయోగిస్తున్నాము. టంబ్లరును ప్లేటుగాను, ప్లేటును టంబ్లర్‌గాను మార్చుకోవచ్చును. రూపనామములు మారినప్పటికీ వెండికి మాత్రం మార్పులేదు. అదేరీతిగా, బాలుడే యువకునిగా, యువకుడే వృద్ధునిగా మార్పు చెందుతాడు. కాని, ఆత్మతత్త్వం మార్పు చెందదు. రూపాలు మారిపోతాయి. మారిపోయే రూపాలను మీరు నమ్మవద్దు. మనస్సు కోతివలె చంచలమైనది. కాబట్టి మనస్సును కూడా మీరు నమ్మవద్దు. అన్నింటికీ ఆధారమైనది ఆత్మతత్త్వం. ఇదే ‘కాన్షియన్స్’. దానిని మీరు నమ్మండి. ఆత్మను విస్మరించి దేహాన్ని, మనస్సును నమ్ముకుంటే ఏనాటికైనా ప్రమాదం తప్పదు.

**భ్రమ ఉన్నంతవరకు బ్రహ్మ చిక్కడు**

పంచభూతాత్మకమైన జగత్తులో ఉన్నంత వరకు పంచభూతాలనే దైవస్వరూపాలుగా విశ్వసించాలి. ఈ పంచభూతాలకు ఆధారమైనది ప్రజ్ఞానము. కనుకనే “ప్రజ్ఞానం బ్రహ్మ” అన్నారు. మీరే ప్రజ్ఞానస్వరూపులు. ప్రజ్ఞాన మనగా లౌకికమైన జ్ఞానం కాదు, భౌతికమైన జ్ఞానం కాదు, పుస్తకజ్ఞానం కాదు. ఇవన్నీ ప్రవృత్తికి సంబంధించినవి. నిజమైన జ్ఞానం మీయందే ఉన్నది. అది మీరు పుట్టిన తరువాత వచ్చేది కాదు, పుట్టుకతోనే మీవెంట వస్తున్నది. అది ఎప్పుడూ మీ వెంటనే, జంటనే ఉండి అన్నివిధాలుగా మీకు సరియైన మార్గం చూపుతున్నది. కాని, మీరు భ్రమకు లోనై మీయందే ఉన్న దైవత్వాన్ని విస్మరిస్తున్నారు. కనుకనే కష్టాలకు గురి అవుతున్నారు. ఈ భ్రమయే ఒక పెద్ద మాయ, మాయ అనేది ప్రత్యేకంగా లేదు. ఏది లేదో అదే మాయ. ఇదంతా మాయయే. ఇవన్నీ కదలిపోయే మేఘాలే. ఏదీ శాశ్వతం కాదు. ఆత్మతత్త్వమొక్కటే శాశ్వతమైనది. అట్టి నిత్యసత్యమైన ఆత్మను మీరు లక్ష్యమునందుంచుకోవాలి.

srisatyasaivachanamrutam

ఈ భౌతికమైన శరీరమున్నంతవరకు మీ కర్తవ్యాన్ని మీరు నిర్వర్తించాలి. ఈ రోజు ఉదయం మీరు పాదుకలకు పూజ చేశారు. ఈ పాదుకలకు ఇంతటి ప్రాముఖ్యత ఎలా వచ్చింది? దేహంలో క్రింద ఉన్నది పాదము, పైన ఉన్నది శిరస్సు. శిరస్సు చాలా ముఖ్యమైనది. అందుకే శిరస్సుకు కిరీటాన్ని ధరిస్తారు. ఇంతటి విలువైన శిరస్సు ఎక్కడికైనా వెళ్ళాలంటే పాదములే తీసుకువెళ్ళాలి. శిరస్సును మోసేవి పాదుకలే. అయితే అన్నింటికీ ముఖ్యమైన ఆధారం ఆత్మతత్త్వమే. అట్టి ఆత్మతత్త్వాన్ని విస్మరించి మీరు భౌతికమైన విషయాలపై ఆధారపడుతున్నారు. భ్రమయే దీనికి మూలకారణం. భ్రమ ఉన్నంత వరకు బ్రహ్మ చిక్కడు.

బ్రహ్మ అనగా విశాలత్వంతో కూడినవాడు. కాబట్టి భగవంతునియొక్క భావములుకూడా విశాలమైనవేగాని, సంకుచితమైనవి కావు. కాని సంకుచితమైన దృష్టికి భగవంతుని భావములు కూడా సంకుచితమైనవిగానే గోచరిస్తాయి. "యద్భావం తద్భవతి" భగవంతునిది విశాలమైన భావము, అనంతమైన సంకల్పము. దీనిని అర్థం చేసుకోవటం ఎవ్వరికీ సాధ్యం కాదు. అర్థం చేసుకోలేక అపార్థం చేసుకుంటారు, యథార్థాన్ని విస్మరిస్తారు. ఈనాటి మానవుడు పదార్థమును ఆధారం చేసుకున్నాడేగాని, పరార్థమును ఆధారం చేసుకోలేదు. పరార్థమే ప్రధానమైనది. ప్రాకృతమైన వస్తువులను ఆధారం చేసుకోవద్దు. అయితే ఈ జగన్నాటక రంగంలో ఉన్నంతవరకు మీ పాత్రను మీరు సమర్థవంతంగా పోషించాలి. మీ కర్తవ్యకర్మలను సక్రమంగా నిర్వర్తించాలి. దీనికి సంబంధించినంతవరకు ప్రపంచాన్ని మీ మనస్సులో ఉంచుకోవచ్చు. నిజంగా మీరు భగవంతుణ్ణి విశ్వసిస్తే తుచ్ఛమైన, ప్రాకృతమైన భావాలు మీలో ఏమాత్రమూ ప్రవేశించవు.

**శ్వాసయే ఈశ్వర స్వరూపం**

ప్రేమస్వరూపులారా! పంచభూతముల యొక్క తత్త్వాన్ని మీరు మొట్టమొదట అర్థం చేసుకుంటే, మీకు దైవత్వం సులభంగా అర్థమౌతుంది. పంచభూతములే మానవునికి ప్రధానమైన ప్రాణములు. ఇందులో ఏ ఒక్కటి లేకపోయినా మానవ జీవితమే లేదు. వాయువు మన కంటికి కనిపించదు, చేతికి చిక్కదు. అంతమాత్రాన వాయువు లేదని చెప్పగలరా? వాయువు లేకపోతే మీరెలా ఉండగలరు? అదియే మీ శ్వాస. దేహంలో శ్వాస ఉన్నంతవరకూ ఇది 'శివం'. శ్వాస లేకపోతే ఇది 'శవం'. శ్వాసయే ఈశ్వరస్వరూపం. ఈశ్వరుడు శ్వాసరూపంలో

sri sathyasai vachanamrutam

అందరియందు సంచరిస్తూ, అన్నివిధాలుగా సంరక్షణ జరుపుతున్నాడు. మొట్టమొదట మీరు తెలుసుకోవలసింది ఏమిటంటే భగవంతునికి ఒక ప్రత్యేకమైన ఆకారం లేదు. ఆకారములన్నీ మీరు కల్పించుకున్నవే. భగవంతునికి నాల్గు చేతులున్నాయని, అతడు శంఖచక్ర గదాపద్మములను ధరించినాడని మీరు భావిస్తున్నారు. నిజంగా భగవంతుడు నాల్గుచేతులతో పుడితే మీరతనిని ఎగ్జిబిషన్‌లో పెడతారు. శంఖము శబ్దబ్రహ్మమునకు, చక్రము కాలచక్రమునకు, గద బలమునకును, పద్మము హృదయపద్మమునకు చిహ్నములు. ఇవన్నీ భగవంతుని హస్తగతమై ఉన్నాయని గుర్తింపజేయటానికే భగవంతునికి ఈవిధమైన ఆకారం కల్పించబడింది. అయితే, అన్ని ఆకారముల కంటే మనుష్యాకారమే అత్యంత విశిష్టమైనది. ఏది ఉత్తమమైనదో, ఏది పవిత్రమైనదో, ఏది సర్వాధారమైనదో దానిని మీరు విశ్వసించాలి. భగవంతుడు ప్రసాదించిన ఇంద్రియాలను సద్వినియోగపరచుకోవాలి. అప్పుడే మీరు నిజమైన మానవులనిపించుకుంటారు. మానవుడనగా త్రికరణశుద్ధి గలవాడని అర్థం. మీరు ఏది సంకల్పించుకున్నారో అది చెప్పాలి, ఏది చెబుతారో అది చేయాలి.

**త్రిదళం త్రిగుణాకారం త్రినేత్రంచ త్రియాయుధం**
**త్రిజన్మ పాపసంహారం ఏకబిల్వం శివార్పణమ్**

**మనస్సు, మాట, క్రియ – ఈ మూడింటినీ దైవార్పితం గావించాలి.**
**దైవం మీచెంతనే ఉండగా చింత ఎందుకు?**

భగవంతుడు ఎల్లప్పుడు మీ ఇంట, వెంట, జంటనే ఉన్నప్పటికీ మీరు భగవంతునికోసం బయట వెదుకుతూ కాలాన్ని వ్యర్థం చేస్తున్నారు. కాలమును వ్యర్థం చేయకూడదు. భగవంతుడు కాలస్వరూపుడు. కనుకనే "కాలాయ నమః, కాలదర్పదమనాయ నమః, కాలాతీతాయనమః , కాల నియమితాయ నమః..." అని మీరు భగవంతుణ్ణి స్తుతిస్తున్నారు. కాల స్వరూపుడైన భగవంతుడు మీ చెంతనే ఉండగా మీరు చింతించట మెందుకు? మొట్టమొదట దివ్యత్వం ఎక్కడో ప్రత్యేకంగా లేదని గుర్తించండి. పవిత్రమైన, పరోపకార సంబంధమైన కర్మలనాచరించండి. "హస్తస్య భూషణం దానం,సత్యం కంఠస్య భూషణం". దానమే హస్తమునకు భూషణం, సత్యమే కంఠమునకు అలంకారం. ఇవే భగవంతునికి ప్రియమైనవి. ఇలాంటి

sri sathyasai vachanamrutam

సహజమైన, విలువైన భూషణములను విడిచిపెట్టటం చేతనే మానవుడు దూషణకు గురియౌతున్నాడు.

ప్రేమస్వరూపులారా! మీ అందరియందు ప్రేమ ఉన్నది. ప్రేమ పవిత్రమైనది. ప్రేమకు మార్పు లేదు. ఇలాంటి పవిత్రమైన ప్రేమను మీరు లౌకికమైన విషయాలపైకి మరల్చుతున్నారు. అందుచేతనే నిందలకు, నిష్ఠూరములకు గురి అవుతున్నారు. ప్రపంచంచేత మెప్పు పొందేటట్లుగా మీ ప్రవర్తనను తీర్చిదిద్దుకోవాలి. మీ దేహాన్ని దైవార్పితం గావించాలి. దైవత్వం మీయందే ఉన్నదని విశ్వసించాలి. దేహం దైవాధారమైనది. కనుక దేహాన్ని సత్కార్యాలకు వినియోగించాలి.

**చెడు చూడవద్దు, మంచినే చూడాలి**
**చెడు వినవద్దు, మంచినే వినాలి**
**చెడు మాట్లాడవద్దు, మంచినే మాట్లాడాలి**
**చెడు తలంచవద్దు, మంచినే తలంచాలి**
**చెడు చేయవద్దు, మంచినే చేయాలి**

ఈ రీతిగా, మీ సర్వాంగములను సార్థకం చేసుకోవాలి. స్వార్థరహితమైన భావంతో పని చేయాలి. అయితే ఇది అంత సులభం కాదు. ఎందుకంటే మానవుడు చేసే ప్రతి పనిలోనూ అంతో, ఇంతో స్వార్థమనేది ఉంటుంది. స్వార్థం ఉండవచ్చును, తప్పు లేదు. కాని దానినొక పరిమితిలో పెట్టుకోవాలి.

భగవంతుడు ఆనందసాగరుడు. ఆనందసాగరంవద్దకు మీరెంత పాత్రను తీసికొనివెళతారో మీకంత ఆనందం లభ్యమౌతుంది. కాబట్టి మీకు ఆనందం అధికంగా కావాలంటే మీ 'పాత్ర'ను పెద్దదిగా చేసుకోవాలి. అనగా మీయొక్క ప్రేమ విశాలమైనది (Expansion Love) గా ఉండాలేగాని, సంకుచితమైనది (Contraction Love)గా ఉండకూడదు. విశాలమైన ప్రేమయే జీవితం. సంకుచిత మైన ప్రేమ మరణంతో సమానం. విశాలమైన ప్రేమను పెంచుకోవాలి. దానిని పదిమందికి పంచాలి. అదియే మీరు చేయవలసిన త్యాగము. "నకర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వ మానశుః" భగవంతునికి మీరు అర్పించవలసింది ఏమిటి? అంతా దైవానిదే, మీదంటూ ఏమీ లేదు.

sri sathyasai vachanamrutam

**ఏ హృదయంబు నొసగితివో ఈశ నాకు**
**మగిడి దానినే అర్పింతు మహితమూర్తి**
**పరగ వేరేమి తెత్తు నీ పాదార్చనకును**
**అంజలి ఘటింతు అందుకోవయ్య నీవు!**

భగవంతుడు మీకు అందించిన హృదయాన్ని తిరిగి మీరు భగవంతునికి అర్పిస్తే చాలు. కాని ఈనాటి మానవుడు గొప్పవిద్యావంతుడు, మేధావి అయినప్పటికీ అజ్ఞానంలో మునిగిపోతున్నాడు.

**చదువులన్ని చదివి చాల వివేకియై**
**మదిని తన్నెఱుగడు మందమతుడు**
**ఎంత చదువు చదివి ఏరీతి నున్నను**
**హీను డవగుణంబు మానలేడు**

**తరచి చదువు చదువ తర్కవాదమెకాని**
**పూర్ణజ్ఞానమెపుడు పొందలేడు**
**చదువులన్ని చదివి చావంగ నేటికి?**
**చావు లేని చదువు చదువవలయు**

మానవుడు కేవలం పొట్టకూటికోసం చదువుతున్నాడు. చదువు చదివేకొలదీ భగవంతుని పట్ల సందేహాలు కూడా అధికమైపోతున్నాయి. అలాంటివాడసలు మనిషే కాదు. పవిత్రమైన హృదయం గలవాడే మనిషి. కన్నుల నిచ్చినదెందుకొ తెలుసా? అన్నీ చూసేటందులకా? కాదు, కాదు. దైవాన్ని చూసేటందులకు. కాని, కొందరు స్వామి ఎదురుగా వచ్చి నిలిచినా కన్నులు మూసుకొని ధ్యానం చేస్తుంటారు. అది వట్టి బూటకపు ధ్యానం! అలాంటివాడు ఏ జన్మలోనో గ్రుడ్డివాడైయుంటాడు. లేక, రాబోయే జన్మలోనైనా గ్రుడ్డివాడైపోతాడు. భగవంతుడు ఎదురుగా ఉంటే కన్నులు మూసుకోవటం అజ్ఞానం. కన్నులు తెరిచి చక్కగా చూడాలి. భౌతికమైన నేత్రములతోపాటు జ్ఞాననేత్రమును కూడా తెరచి చూడాలి.

"నాలుక నిచ్చిన దెందుకొ తెలుసా? నోటికి ముద్దందించుటకా? కాదు, భగవన్నామాన్ని

sri sathyasai vachanamrutam

నోరార పలికేటందులకు." నిరంతరం భగవచ్చింతన చేయాలి. నాలుక ఉన్నది కదా అని ఇష్టమొచ్చినట్లు మాట్లాడి ఇతరులను నొప్పించకూడదు. మృదుమధురంగా మాట్లాడాలి. అయితే కొంతమంది మంచి మాటలతో చెబితే వినరు. అది వారి కర్మ. వారు వినటం లేదు కదా అని మీరు వారితో కఠినోక్తులాడకూడదు. మంచిగానే చెప్పాలి. మంచిగా చెప్పటం చేతగాకపోతే మౌనంగా ఉండాలి. "మౌనం కలహం నాస్తి." మౌనంగా ఉంటే కలహం రాదు. పవిత్రమైన పలుకులను, పవిత్రమైన చూపులను భగవంతునికి అర్పితం చేయాలి.

**ఏ పని చేసినా పరిపూర్ణంగా చేయాలి**

దైవత్వం మానవునియందే ఉన్నది. తన యందున్న దైవత్వాన్ని గుర్తించుకోలేకపోవటంచేతనే మానవుడు మూర్ఖంగా ప్రవర్తిస్తున్నాడు. దైవత్వాన్ని నేడు కాకపోయినా రేపైనా గుర్తించక తప్పదు. దైవత్వాన్ని గుర్తించినప్పుడే మానవుడు పరిపూర్ణుడౌతాడు. పూర్వం ఆంథోనీ అనే వ్యక్తి వయోలిన్లను తయారు చేసేవాడు. అయితే ఒక వయోలిన్‌ను తయారుచేయటానికి అతనికి ఒక సంవత్సరం పట్టేది. ఒకనాడు అతని స్నేహితులు "ఆంథోనీ! నీవు ఒక వయోలిన్ తయారుచేయటానికొక సంవత్సరం తీసుకుంటే, నీ కుటుంబాన్ని ఏరీతిగా పోషించగలవు? నీవు కాలాన్ని వ్యర్థం చేస్తున్నావు" అని మందలించారు. అప్పుడు ఆంథోనీ చెప్పాడు - "సోదరులారా! నేను చేసేది భగవత్కార్యము. భగవంతుడు పరిపూర్ణుడు. కాబట్టి నేను తయారు చేసే వయోలిన్ కూడా పరిపూర్ణమైనదిగా ఉండాలి. దానినుండి అపస్వరములు రాకూడదు. అలాంటి వయోలిన్‌ను తయారు చేయాలనే ఉద్దేశ్యంతోనే నేను ఎక్కువ సమయం తీసుకుంటున్నాను" అన్నాడు. అందుచేతనే ఆంథోనీ వయోలిన్లు చాలా ప్రసిద్ధి గాంచినాయి. భగవంతుడు పరిపూర్ణుడు. కాబట్టి, మీరు ఏమి చేసినా పరిపూర్ణంగా, భగవంతునికి తృప్తికరంగా చేయాలి. అప్పుడే ఆ పని సార్థకమౌతుంది.

భగవంతుడు ఏ పని చేసినా పరిపూర్ణంగా చేస్తాడు. నేను భక్తులకు ఉంగరాలను సృష్టించి ఇస్తుంటాను. నేను ఎవరికి ఇచ్చినా అది వారి వ్రేలికి సరిగ్గా సరిపోతుంది. కొలత తీసుకుని తయారుచేసే 'గోల్డ్‌స్మిత్' కూడా పొరపాటు చేయటానికి అవకాశముందిగాని, భగవంతుడనే 'లైఫ్‌స్మిత్' ఏది చేసినా 'పర్ఫెక్ట్' (పరిపూర్ణం) గా ఉంటుంది. అట్లే మీరు కూడా ఏది చేసినా

sri sathyasaivachanamrutam

పరిపూర్ణంగా చేయాలి. చేయించుకున్నవారూ తృప్తి పడాలి, చేసినవారికీ తృప్తి కల్గాలి. అదియే నిజమైన సేవ. అలాంటి సేవలో ఉన్న ఆనందం మరి దేనియందూ లేదు.

మీరు చేసే పనులు పరులకు హితంగా ఉన్నప్పుడే నేను మీకు సన్నిహితుడనౌతాను, మీకు ఫ్రెండ్‌గా ఉంటాను. పరులకు ఇంత అన్నం పెట్టినా సరియైనరీతిగా పెట్టాలి. నిన్నటి దినం మా పిల్లలందరూ పాపం చాలా శ్రమపడి, దూరగ్రామాలకు వెళ్ళి సేవ చేశారు. అక్కడ రాత్రి పది గంటలవరకు అందరికీ ఆహారపు పొట్లాలను పంచారు. వారు చేసినది మంచి పనియే. కాని విచక్షణనుపయోగించ లేదు. నేను చెప్పాను – "నాయనా! ఆ ఆహారం తెల్లవారుజామున తయారు చేసినది. ఇది రాత్రి పదిగంటల వరకు చెడిపోకుండా ఉండగలదా? అంతమాత్రం మీరు గుర్తించలేకపోయారా? అన్నం చెడిపోతే దానిని వెనుకకు తెచ్చి, మరునాడు మంచి ఆహారాన్ని తీసుకువెళ్ళి పంచిపెట్టాలి. చెడిపోయిన ఆహారాన్ని పంచిపెట్టటం చాలా తప్పు" అని. కాని విద్యార్థులు తాము చేస్తున్న పనిలో పూర్తిగా నిమగ్నం కావటంచేత ఈవిషయాన్ని గమనించలేదు. ఇంతేకాదు, వాళ్ళు మధ్యాహ్నం భుజించిన తరువాత ఏమాత్రం విశ్రాంతి లేకుండా పని చేశారు. Sleep awhile after lunch. మధ్యాహ్న భోజనం తరువాత కొద్దిసేపు విశ్రాంతి తీసుకోవాలి. కాని పిల్లలకు ఒక్క నిమిషమైనా విశ్రాంతి లేదు; భోజనం చేసిన వెంటనే ఊరూరూ తిరిగారు. అందువల్ల కొందరికి కడుపులో త్రిప్పటం, జ్వరం రావటం ... ఇలాంటివి జరిగాయి.

## స్వార్థాన్ని త్యజించి పరార్థాన్ని వరించండి

విద్యార్థులారా! విద్యార్థినులారా! మీరు ఏ పని చేసినా విచక్షణతో చేయాలి. ఈనాడు మీరు పిల్లలుగా ఉన్నారు. భవిష్యత్తులో మీరు తల్లులు, తండ్రులు కాబోతున్నారు. కాబట్టి ఇప్పటి నుండియే పవిత్రమైన గుణములను పోషించుకోండి. పవిత్రమైన చర్యలను చేపట్టండి. అప్పుడే మీరు భవిష్యత్తులో పవిత్రమైన జీవితాన్ని గడపగలరు. మానవజన్మ చాలా పవిత్రమైనది, అత్యంత విలువైనది. 'జంతూనాం నరజన్మ దుర్లభం.' మానవునికున్న విలువను మరి దేనితోనూ పోల్చటానికి వీలుకాదు. బంగారానికి, వజ్రానికి ఎవరు విలువిస్తున్నారు? మనిషే కదా! Men



srisathyasaivachanamrutam

are more valuable than all the wealth of the world. మనిషికంటే విలువైనదేదీ లేదు. ఆ విలువను మీరు కాపాడుకోవాలి. స్వార్థరహితమైన కర్మలనాచరించినప్పుడే మీరు మీ విలువను కాపాడుకున్నవారౌతారు.

ఈనాటి మానవుడు చిన్నచిన్న విషయాలలో కూడా తన స్వార్థాన్ని చూసుకుంటున్నాడు. Fish is better than selfish. చేప నీటిలో సంచరిస్తూ, అందులో ఉన్న మురికినంతా తినేసి నీటిని పరిశుభ్రపరచుతుంది. కాని స్వార్థపరుడు సమాజంలో జీవిస్తూ సమాజాన్ని మాలిన్యపరుస్తాడు. స్వార్థం ఉండవచ్చును. కాని హద్దు మీరిన స్వార్థం మంచిది కాదు. 'మనిషి' అనే పదం త్రిప్పి చదివితే 'షినిమ' అవుతుంది. ఈనాటి మానవుడు సినిమా మనిషిగా మారిపోతున్నాడు. 'మానవ' అనే పదంలో 'మా' అనగా అజ్ఞానం, 'న' అనగా లేకుండా, 'వ' అనగా వర్తించటం. కాబట్టి అజ్ఞానం లేకుండా వర్తించేవాడే మానవుడు. అట్టి మానవులుగా మీరు తయారు కావాలి. అప్పుడే మీరు చదివిన చదువు సార్థకమౌతుంది.

విద్యార్థులారా! మీరు సత్కీర్తిని ఆర్జించి, ప్రపంచానికి ఆదర్శాన్ని అందించండి. ఈనాడు ప్రపంచం చాలా అయోమయ స్థితిలో ఉన్నది. ఎక్కడ చూసినా అశాంతియే, ఎక్కడ చూసినా దుఃఖమే, ఎక్కడ చూసినా పాపమే, ఎక్కడ చూసినా క్రోధమే. కనుక, మీరు ప్రపంచానికి శాంతిభద్రతలను అందించటానికి కంకణం కట్టుకోవాలి. శాంతి ఎక్కడుంది? మీయందే ఉన్నది. మీరే శాంతిస్వరూపులు. స్వార్థాన్ని త్యజించి, పరార్థాన్ని వరించినప్పుడే మీరు శాంతిని అనుభవించగలరు.

**ఆధ్యాత్మికరంగంలో వ్యాపారధోరణి తగదు**

పూర్వం విద్యాసంస్థలుగాని, వైద్యసంస్థలు గాని స్వార్థరహితంగా ప్రజలకు సేవలందించేవి. కాని ఈనాడు విద్యావైద్యరంగాలు స్వార్థంతో కలుషితమైనాయి. పదికోట్లు ఖర్చు పెట్టి ఆసుపత్రి కట్టిస్తే నూరుకోట్ల ఆదాయాన్ని ఆశిస్తున్నారు. ఒక చిన్న పిల్లవాడిని కె.జి.లో చేర్చవలెనన్న 20 లేక 25 వేలు డొనేషన్ కట్టవలసివస్తోంది. పాపం బీదవారు ఇంత డబ్బు ఎక్కడి నుండి తేగలరు? ఇంతేకాదు. ఈనాడు ఆధ్యాత్మికరంగంలో కూడా వ్యాపారధోరణి ప్రవేశించింది. ఆధ్యాత్మికం అందరికీ ఉచితంగా అందుబాటులో ఉండాలి. ప్రేమను పంచాలి.

sri sathyasai vachanamrutam

అట్లుగాకుండా ఆధ్యాత్మికం పేరిట మీరు వ్యాపారం చేస్తే అంతా పాడైపోతుంది, భగవంతుని పేరును కూడా మీరు పాడుచేసినవారౌతారు. మీరు పెట్టే ఖర్చులకు సరిపడేంత డబ్బు తీసుకోవచ్చు. అయితే నాకోసం ఎవ్వరూ ఖర్చుపెట్టరు, నేను ఎవరివద్ద నుండీ ఏమీ తీసుకోను. మధురైవాళ్ళు ఈ కార్యక్రమం నిమిత్తం ఖర్చులు పెట్టారు. ఇక్కడికి రావటానికి, భోజనాలకి ఖర్చులౌతాయి. అయితే ఆ ఖర్చుకు తగినంత మాత్రమే డబ్బు తీసుకోవాలి. 'మెంబర్‌షిప్ ఫీజు' (సభ్యత్వ రుసుము) ఇంత అని పెట్టకూడదు. ఆధ్యాత్మికంలో మెంబర్‌షిప్ ఫీజు ఏమిటి? ప్రేమయే. ప్రేమను ఇచ్చి పుచ్చుకోవాలి. ఇకమీదట ఈవిషయాన్ని గుర్తుపెట్టుకొని మన సంస్థలవారు ఎవరివద్ద నుండీ ఎలాంటి ఫీజులూ వసూలు చేయరాదని నేను ఆశిస్తున్నాను. మీ అందరికీ తెలుసు. మేము మా విద్యాసంస్థలలో విద్యార్థుల నుండి నయాపైసా తీసుకోవటం లేదు. మా హాస్పిటల్స్‌లో మందులు ఉచితంగా ఇస్తున్నాము, ఆపరేషన్లు ఉచితంగా చేస్తున్నాము. నిజంగా తోటివారి మంచిని కోరి పని చేస్తే డబ్బు ఏదో ఒకరీతిగా సమకూరుతుంది. కాని ధనార్జనే ధ్యేయంగా పని చేస్తే చివరికి నష్టమే వస్తుంది.

కాబట్టి మీరు డబ్బుకోసం ప్రాకులాడకండి. నీతినియమాలను పోషించుకోండి. ఆత్మయొక్క విలువ ఎంత? ఆత్మకు ఎవరు విలువకట్టగలరు? ఆత్మ అమూల్యమైనది, అనంతమైనది, అప్రమేయమైనది. కనుక ఆధ్యాత్మిక సంస్థలందు ఎలాంటి ఫీజూ పుచ్చుకోకూడదు. ఇట్టి మార్గాన్ని మనం అవలంబించినప్పుడు ప్రపంచమంతా ఆధ్యాత్మిక మార్గంలో ప్రవేశిస్తుంది. ఈనాడు ఎక్కడికి పోయినా అశాంతియే, ఏ పేపర్లు చూసినా భయంకరమైన వార్తలే. మీరు శాంతిని అనుభవిస్తే ప్రపంచమంతటా శాంతి వెల్లివిరుస్తుంది. కనుక, మీరు ప్రశాంతమైన జీవితాన్ని గడుపుతూ, ప్రపంచానికి శాంతిని అందించండి.

**(09-10-2001 సాయంత్రం సాయికుల్వంత్ హాల్‌లో శ్రీవారు అనుగ్రహించిన దివ్యసందేశము)**

sri sathyasaivachanamrutam